క్లుప్తంగా

దాతల సాయంతో పుస్తకాల పంపిణీ

పాలకోడేరు: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ప్రజలు, దాతల సహకారం అవసరమని శృంగవృక్షం ఎంపీటీసీ సభ్యురాలు సూర్యకళ అన్నారు. శృంగవృక్షం పంచాయతీ పరిధిలోని బంటుమిల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన డీఎస్పీ బండి పెద్దిరాజు రూ.20 వేలు ఆర్థిక సహకారంతో సమకూర్చిన రాత పుస్తకాలు, విద్యా సామగ్రిని సోమవారం విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాలా లక్ష్మీరావు, కడలి సాయిబాబు, బండి వెంకటేశ్వరావు, బొక్కా ప్రసాద్, పాలా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ జిల్లా కన్వీనర్‌గా రమణారావు

భీమవరం అర్బన్: మండలంలో కొవ్వాడ అన్నవరం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్న పీవీఎస్ఎస్‌బీ రమణారావును ఏపీటీఎఫ్1938 అసోషియేషన్ జిల్లా శాఖ కన్వీనర్‌గా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హృదయరాజు, చిరంజీవి నియామకం చేశారు. ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. జిల్లా నూతన కన్వీనర్‌గా నియమితులైన రమణారావు మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానన్నారు. రమణారావును పలువురు ఉపాధ్యాయులు, పలు సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

అంగన్‌వాడీల ధర్నా

సాక్షి, భీమవరం: సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా 36 గంటల అంగన్‌వాడీల ధర్నా సోమవారం ప్రారంభమైంది. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కే ఝాన్సీ లక్ష్మి అధ్యక్షతన జరిగిన ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు మాతా శిశు సంక్షేమంలో కీలక పాత్ర పోషిస్తున్నారని,. ప్రస్తుతం వారికి ఇస్తున్న వేతనం పెరిగిన ధరలతో పోలిస్తే చాలడం లేదన్నారు. కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చేపలు, రొయ్యల పెంపకంపై అవగాహన



మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీనివాస్

నరసాపురం రూరల్: భూసార, నీటి పరీక్ష ఫలితాల ఆధారంగానే రొయ్యలు, చేపల సాగు చేసుకోవాలని మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాస్ అన్నారు. జాతీయ మత్స్య రైతుల దినోత్సవం సందర్భంగా నరసాపురం మండలం పసలదీవి గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ఉండి వారి ఆధ్వర్యంలో చేపలు, రొయ్యల పెంపకంపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చెరువు ఎండగట్టిన అనంతరం భూసార పరీక్ష చేయించి, నివేదిక ఆధారంగా వాడాల్సిన మినరల్స్, కాల్షియం, మెగ్నీషియం వంటివి, సేంద్రియ ఎరువుల మోతాదు నిర్ణయించుకోవచ్చని అన్నారు. వనామీ చెరువుల్లో కాల్షియం, మెగ్నీషియం, పొటాష్ తప్పనిసరిగా పరీక్షించుకుని ప్రతి 15 రోజులకు ఒకసారి 1:2:1 నిష్పత్తిలో ఉండేటట్టు చూసుకోవాలన్నారు. రొయ్యపిల్లను హేచరీల నుంచి సేకరించినప్పుడు తప్పనిసరిగా బీసీఆర్ పరీక్ష చేసి ఈహెచ్‌పీ, వైరస్ వ్యాధులు లేవని నిర్ధారించుకోవాలని సూచించారు. రొయ్య పిల్ల వేసే ముందు రోజు తౌడు 20 కిలోలు, బెల్లం 4 కిలోలు, ఈస్ట్ 100 గ్రాములు ఎకరానికి తగినంత నీటిలో నానబెట్టి రెండు రోజులు నిల్వ ఉంచి చెరువులో చల్లుకోవాలన్నారు. సర్పంచ్ కొట్టు రామాంజనేయులు, ఎంపీటీసీ పులపర్తి రాంబాబు, ఆక్వా సిబ్బంది దివాకర్ పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

తాడేపల్లిగూడెం: జ్వరాలపై అపోహలు వద్దని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సబ్‌యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు కోరారు. 50వ విడత ఫీవర్ సర్వేలో భాగంగా సోమవారం డెంగ్యూ నివారణ మాసోత్సవాలను పురస్కరించుకొని యాగర్లపల్లి 20, 24, 25 వార్డుల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియా వంటి సమచారాన్ని అందించాలని కోరారు. జ్వరాలను తొలిదశలో గుర్తించడం ద్వారా వైద్యం సులభతరం అవుతుందన్నారు. ఆరోగ్య కార్యదర్శులు, ఆరోగ్యసహాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

పాలకొల్లు అర్బన్: వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు సహకారంతో సోమవారం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులు, బాలింతలకు ప్రధాన మంత్రి మాతృత్వ సమృద్ధి యోజన పథకంలో పౌష్టికాహారం అందజేశారు. మొత్తం 35 మందికి ఖర్జూరం, రసుకులు, బలం అరుకులు అందించారు. కార్యక్రమంలో క్షత్రియ సంక్షేమ పరిషత్ కార్యదర్శి కేఎస్‌పీఎస్ వర్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభాకరరావు పాల్గొన్నారు.

పవన్ వ్యాఖ్యలపై నిరసనల వెల్లువ

- తక్షణమే క్షమాపణ చెప్పాలంటూ వలంటీర్ల డిమాండ్
- పలు చోట్ల పవన్ దిష్టిబొమ్మల దహనం, నిరసన ప్రదర్శనలు



దొడ్డనపూడిలో గాంధీజీ విగ్రహం వద్ద వినతిపత్రం చూపుతున్న వలంటీర్లు



పవన్‌పై ఆకివీడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న పట్టణ వలంటీర్లు



గుమ్ములూరు సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న పట్టణ వలంటీర్లు



పాలకోడేరులో నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వలంటీర్లపై జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో సోమవారం నిరసనలు వెల్లువెత్తాయి. పలు చోట్ల నిరసన ప్రదర్శనలు నిర్వహించడంతో పాటు పవన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. పవన్ కల్యాణ్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు.

భగ్గుమన్న వలంటీర్లు

పవన్ వ్యాఖ్యలపై వలంటీర్లు భగ్గుమన్నారు. భీమవరం అంబేడ్కర్ చౌక్‌లో పట్టణంలోని అన్ని వార్డుల వలంటీర్లు తరలివచ్చి పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకురావడంతో వలంటీర్లుగా తాము ప్రజలకు సేవ చేసుకునే అవకాశం లభించి సంతోషంతో పనిచేస్తుంటే నాడు చంద్రబాబు, నేడు పవన్ కల్యాణ్ తమపై నీచమైన మాటలు మాట్లాడుతున్నారని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కరోనా సమయంలో భీమవరంలో తాము రెడ్‌జోన్‌లో కూడా ప్రజలకు సేవలు అందిస్తే ఇక్కడే పోటీ చేసిన పవన్ పట్టణంలో ప్రజలు కనీసం ఎలా ఉన్నారనే ఆరా కూడా తీయలేదని, ఇటువంటి వ్యక్తి తమ గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వలంటీర్ల సేవలను దేశ వ్యాప్తంగా అభినందిస్తుంటే పవన్ మాత్రం తమపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అవమానపర్చడం బాధాకరమన్నారు. పవన్ దమ్ముంటే రాజకీయాల్లో తానేంటో నిరూపించుకుని కనీసం ఎమ్మెల్యే అయితే బాగుంటుందని, అది మానేసి వలంటీర్ల గురించి నీచంగా మాట్లాడితే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తమపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో వలంటీర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సినిమా హీరోగా పవన్‌ను అభిమానించే వారు వలంటీర్లు అనేక మంది ఉన్నారని, ఆయన చేసిన వ్యాఖ్యలతో నేటి నుంచి ఆయనను అభిమానించడం మానుకుంటామన్నారు. మాకు ఎప్పటికీ రియల్ హీరో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని వలంటీర్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భీమవరంలోని 40 వార్డు సచివాలయాల వలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు.

పవన్ క్షమాపణలు చెప్పాలి

వీరవాసరం: గ్రామ వలంటీర్లపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని మండల గ్రామ వలంటీర్లు డిమాండ్ చేశారు. వీరవాసరం తూర్పు చెరువు సెంటర్లో గ్రామ వలంటీర్ల ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి మరీ ప్రజలకు సేవలు చేశామని, ప్రజలంతా మాపై మంచి ఉద్దేశంతో ఉన్నారని గుర్తు చేశారు. వృద్ధాప్య, వికలాంగ పెన్షన్లను ఇంటి వద్దకు తీసుకుని వెళ్లి అందజేస్తుంటే వారంతా ఎంతో సంతోషిస్తున్నారని వివరించారు. పవన్ కల్యాణ్ డౌన్ డౌన్ అంటూ నినదించారు. కార్యక్రమంలో పడవల నాని, కిరణ్ కుమార్, ఏ స్వాతి, గ్రామ వాలంటీర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందజేత

కాళ్ల: వలంటీర్ వ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానకరంగా మాట్లాడిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వాలంటీర్లకు క్షమాపణ చెప్పాలని దొడ్డనపూడి గ్రామ వలంటీర్లు డిమాండ్ చేశారు. దొడ్డనపూడిలో సోమవారం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు గ్రామ వలంటీర్లు నిరసన తెలిపారు. సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి చేరవేస్తూ కుటుంబ సభ్యుల ఉంటున్న వలంటీర్లను నీచంగా మాట్లాడిన పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి వినూత్న నిరసన తెలియజేశారు. అనంతరం కాళ్ల పోలీస్‌స్టేషన్లో పవన్‌పై ఫిర్యాదు చేశారు.

వలంటీర్లను కించపరచడం నీచ రాజకీయం

ఆకివీడు: వలంటీర్లను కించపరచి నీచ రాజకీయానికి పవన్ కల్యాణ్ పాల్పడటం సిగ్గుచేటని పలువురు వలంటీర్లు తీవ్రంగా ఖండించారు. సోమవారం ఉదయం స్థానిక నగర పంచాయతీ నుంచి వలంటీర్లు ప్రదర్శన నిర్వహించి, గుమ్ములూరు సెంటర్‌లో రాస్తారోకో చేశారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పవన్ డౌన్ డౌన్, నీచ రాజకీయాలు చేస్తే ప్రజలు బుద్ధి చెబుతారంటూ నినాదాలు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ వరకు ప్రదర్శన కొనసాగింది. రూరల్ సీఐ గీతా రామకృష్ణకు వినతిపత్రం అందజేసి మహిళలు పవన్‌పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు పలువురు మాట్లాడుతూ కేంద్ర దర్యాప్తు బృందం తెలిపిందంటూ తప్పుడు నివేదికలతో పవన్ వలంటీర్ వ్యవస్థను వలంటీర్‌గా పనిచేస్తున్న యువతుల్ని కించపరుస్తున్నారని ధ్వజమెత్తారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థపై ప్రతిపక్షాలు పన్నుతున్న కుట్రలో భాగంగానే పవన్ వ్యాఖ్యలున్నాయన్నారు. ఇటువంటి అసత్య, దుర్మార్గపు ఆరోపణల్ని తక్షణం వెనక్కి తీసుకుని మహిళల్ని, మహిళా వలంటీర్ల పట్ల గౌరవం పెంచుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, పలువురు వలంటీర్లు, మహిళా కౌన్సిలర్లు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, నాయకులు జామి శ్రీనివాస్, అంబటి రమేష్, జోగి నాగరాజు, అందేరాజబాబు, ఎండీ.అలీ, మాబూ పాల్గొన్నారు.

పవన్‌పై మండిపడ్డ వలంటీర్లు

పాలకోడేరు: వలంటీర్లను కించపరిచేలా మాట్లాడిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్షమాపణలు చెప్పాలని గ్రామ వలంటీర్లు డిమాండ్ చేశారు. పవన్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మండలానికి చెందిన పలువురు వలంటీర్లు పాలకోడేరులో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. నిత్యం ప్రజాసేవలో ఉంటూ వృద్ధులు, దివ్యాంగులకు సేవలందిస్తున్న తమను కించపరిచేలా మాట్లాడంపై తీవ్రంగా మండిపడ్డారు. పవన్ కల్యాణ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దెందుకూరి వెంకటరాజు, గృహ సారథులు పాలా రాధాకృష్ణ, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

పవన్ వ్యాఖ్యలు దారుణం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



పెదఅమిరంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

సాక్షి, భీమవరం: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా నిస్వార్థ సేవలందిస్తున్న వలంటీర్లపై జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అసంబద్ధ వ్యాఖ్యలు చేయడం దారుణమని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తీవ్రంగా దుయ్యబట్టారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వలంటీర్లు సేవాభావంతో కష్టపడి పనిచేస్తుంటే లేనిపోని ఆరోపణలు చేయడం పవన్ కల్యాణ్ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. అవ్వాతాతలకు ప్రతి నెల 1వ తేదీనే పింఛన్లు అందించడమేగాక, నిత్యం అన్నివర్గాలకు సేవలందిస్తూ ప్రశంసనీయమైన పాత్ర పోషిస్తున్నారని శ్రీనివాస్ కొనియాడారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ అర్హులంతా లబ్ధి పొందేలా సేవ చేయడంలో వారు నిబద్ధతను కనబరుస్తున్నారని వలంటీర్ల అంకితభావానికి అవధులు లేవన్నారు. దేశంలోని మిగిలిన రాష్ట్రాలు సైతం వలంటీర్ల వ్యవస్థ, సేవలను ప్రశంసిస్తూ ఆయా రాష్ట్రాల్లో అమలుకు సన్నద్ధమవుతుంటే వలంటీర్లపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడమే కాకుండా వారి సేవలను కించపరుస్తూ మాట్లాడిన పవన్ కల్యాణ్, జనసేన పార్టీ తక్షణం వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

పవన్‌కు మహిళలంటే గౌరవ లేదు

కాళ్ల: వారాహి యాత్రలో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు తీవ్రంగా ఖండించారు. పెదఅమిరం పార్టీ క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో పీవీఎల్ మాట్లాడారు. పవన్‌కు మహిళలంటే గౌరవ భావం లేదన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందజేస్తున్న వలంటీర్ల వ్యవస్థను మాఫియాగా చిత్రీకరించి పవన్ మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. కరోనా లాంటి కష్టకాలంలో సైతం ప్రాణాలకు తెగించి సేవలు అందించిన వలంటీర్ల వ్యవస్థను ప్రపంచవ్యాప్తంగా కొనియాడుతుంటే పవన్ నీచమైన పదాలతో అగౌరవంగా మాట్లాడటం దుర్మార్గపు చర్య అన్నారు. జీతం లేకుండా గౌరవ వేతనం మాత్రమే తీసుకుని ప్రజలకు సేవలు అందిస్తున్న వారిని ఈ విధంగా అవమానించడం సబబు కాదని హితవుపలికారు. రానున్న రోజుల్లో మహిళలే పవన్ కల్యాణ్‌కు బుద్ధి చెబుతారన్నారు. చంద్రబాబు రాసిన స్క్రిప్టును చదువుతూ నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎన్నికల వరకే చంద్రబాబు పవన్ వాడుకుని కరివేపాకుల తీసివేస్తారని అన్నారు. పవన్ కల్యాణ్ కాపు కులానికి కొమ్ముకాస్తానని చెబుతూ ఆ కులానికే ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. కాపులను విడదీసి కులాల మధ్య చిచ్చుపెట్టేలా పవన్ ప్రవర్తిస్తున్నాడని ఘాటుగా విమర్శించారు. వారాహి యాత్రలో వైఎస్సార్ సీపీ నాయకులను తోలు తీస్తా తాటతీస్తా అంటూ పరుష పదజాలంతో పవన్ కళ్యాణ్ మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరొకసారి ఈ విధంగా ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని ఖబడ్దార్ పవన్ కల్యాణ్ అంటూ హెచ్చరించారు. వలంటీర్లను నీచమైన పదజాలంతో దుర్మార్గంగా మాట్లాడిన పవన్ కల్యాణ్ వలంటీర్లకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, రణస్తుల కనకదుర్గ మహంకాళి, ఉండి ఎంపీపీ ఇందుకూరి శ్రీ హరినారాయణరాజు, రాష్ట్ర జానపద సృజనాత్మక అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్ గుల్లిపల్లి అచ్చారావు, కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయరామకృష్ణంరాజు, సొసైటీ డైరెక్టర్ కరిమెరక శివ నాగరాజు, గుండు నాగేశ్వరరావు, బడుగు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత



కాళ్లలో గర్భిణికి పౌష్టికాహారం అందిస్తున్న వెంకటరత్నం

కాళ్ల: కాళ్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిస్ట్రిక్ట్ పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ వెంకటరత్నం సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి గర్భిణి పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని వివరించారు. అనంతరం పలువురు గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎం బాల, పిహెచ్సీ డాక్టర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలి

మహిళా సమాఖ్య ఆత్మీయ సభలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్



ఆకివీడులో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్‌కు సన్మానం చేస్తున్న మహిళలు

ఆకివీడు: మహిళలు ఆర్థికశక్తిగా ఎదిగినప్పుడే రాష్ట్ర ఆర్థికాభివృద్ధి మరింత పెరుగుతుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని మహిళా సమాఖ్య భవనంలో సోమవారం నిర్వహించిన ఆత్మీయ సభలో భవన నిర్మాణ దాతలకు సత్కారం చేశారు. అనంతరం మహిళలనుద్దేశించి పీవీఎల్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం బాగుండాలంటే మహిళ ఆర్థికంగా ఎదగాలన్నారు. కుటుంబాలు బాగుపడితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయన్నారు. మహిళల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని చర్యలూ తీసుకుంటున్నారన్నారు. మహిళల భద్రతకు ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలో మహిళలకు పూర్తి రక్షణ ఉందన్నారు. మహిళా పక్షపాతిగా ఉన్న సీఎం వైఎస్ జగన్ స్త్రీనిధి పెంపు, సున్నా వడ్డీ, రుణ మాఫీ వంటివి అమలుజేస్తూ మహిళలకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు మహిళలకు రుణమాఫీ చేస్తానని మోసం చేశారన్నారు. ఎన్నికల సమయంలో పసుపు కుంకుమ పేరుతో సెంటిమెంట్‌గా వాడుకోవాలని చూశారని ఆరోపించారు. చంద్రబాబు కుట్రల్ని మహిళలు గుర్తించి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేశారన్నారు. మళ్లీ, మళ్లీ సీఎంగా జగన్ చేసేందుకు, మహిళా అభివృద్ధికి, మహిళా స్వేచ్ఛకు మహిళలంతా కలిసి దీవించాలని కోరారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి మాట్లాడుతూ మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌ను మహిళలు మరిచిపోకూడదన్నారు. నాలుగేళ్ల పాలనలో పొందిన లబ్ధిని గుర్తించి మద్దతివ్వాలన్నారు. మహిళాసమాఖ్య అధ్యక్షురాలు పళ్లెం అరుణ కుమారి అధ్యక్షతన జరిగిన సభలో సర్పంచ్‌లు నల్లపురాజు రామారాజు, చిట్టిబాబు, నాతిరెడ్డి ఆదిలక్ష్మి అన్నవరం, మహిళా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు మోరా జ్యోతి, కార్యదర్శి పొలిపిరెడ్డి కనకదుర్గ, ఏపీఎం నాగభూషణం నాయుడు, పుప్పాల పండు తదితరులు పాల్గొన్నారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఉదయం రెండు ద్విచక్ర వాహనాలు వేలం నిర్వహించనున్నట్లు రూరల్ ఎస్సై బి.మోహన్‌రావు సోమవారం చెప్పారు. 2020–2021కు సంబంధించి మద్యం కేసుల్లో పట్టుబడ్డ రెండు ద్విచక్ర వాహనాలకు వేలం వేస్తామని, ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని కోరారు.

భూపతి ఎన్నికపై హర్షం

సాక్షి, భీమవరం: వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా భూపతి రవీంద్రరాజు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై జిల్లా సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గుమ్మళ్ల జకరయ్య సోమవారం భీమవరంలో విలేకరులతో మాట్లాడుతూ విజయవాడలో జరిగిన సంఘం రాష్ట్ర ఎన్నికల్లో జిల్లాకు చెందిన రవీంద్రరాజు అధ్యక్షుడిగా, మిరియాల లక్ష్మీనారాయణ ఉపాధ్యక్షుడిగా, అనూష ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నికయ్యారన్నారు. జిల్లాకు చెందిన వారు రాష్ట్ర సంఘంలో పదవులు పొందడం అభినందనీయమని జక్కరయ్య పేర్కొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

మద్దాల లీల కిరణ్, తండ్రి : జాన్ విల్సన్, డోర్ నెం.21-2-16, ... భీమవరం ... ఒరిజినల్ పాస్‌పోర్టు (నెం.L403351 గల ఒ) ... ది.05.07.2023 తేదీన ... పాస్‌పోర్టు పోయినది. ...

ఈహెచ్‌ఆర్ నమోదు తీరు పరిశీలన



ఉండి పీహెచ్‌సీ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారులు

ఉండి: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు డీపీఎంఓ డాక్టర్ సుగుణ, ఏఓ డాక్టర్ వెంకటరెడ్డి సోమవారం ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆధార్ కార్డుతో ఈహెచ్‌ఆర్ (ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు) నమోదు తీరును పరిశీలించారు. పీహెచ్‌సీకి వచ్చే ప్రతి రోగి తప్పకుండా ఆధార్‌కార్డు తెచ్చుకోవాలని తెలియపరచాలని వారు సూచించారు. ఎందుకంటే వారి ఆధార్‌కార్డు నంబర్‌తో పాటుగా వారి ఆరోగ్య వివరాలతో ఆన్‌లైన్‌లో వారి రికార్డు నమోదు చేస్తారన్నారు. దీని వల్ల సదరు వ్యక్తి రాష్ట్రంలో ఏ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందినా అక్కడ వారి ఆరోగ్య వివరాలతో కూడిన రికార్డును తీసి పరిశీలించడం ద్వారా సులభంగా రోగికి చికిత్స అందించవచ్చునన్నారు. ఈసేవలను ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పీ ధర్మతేజ్ ఆధ్వర్యంలో అధికారులకు రికార్డుల వివరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

నటుడు సుమన్ వ్యాఖ్యలకు నిరసనగా ధర్నా



భీమవరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: సినీ హీరో సుమన్ క్రైస్తవులు, ముస్లింలపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం దళిత ఐక్యవేదిక, వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో భీమవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ మాట్లాడుతూ హీరో సుమన్ క్రైస్తవులను, ముస్లింలను కించపర్చేలా మాట్లాడడం దారుణమన్నారు. సుమన్ వ్యాఖ్యలు కులాల మధ్య చిచ్చుపెట్టేలా ఉన్నాయని, వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలపర్తి జోనా, పట్టెం శుభాకర్, ఆలమూరి బాబ్జి, గొల్ల రాజ్‌కుమార్, ఎండీ మున్వర్, షకీల్, ఖలీల్, అహ్మద్, పి.సహదేవరాజ్, కర్రా కల్యాణ్ పాల్గొన్నారు.

పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ

సాక్షి, భీమవరం: ప్రజలకు ప్రభుత్వానికి అనుసంధానకర్తలుగా పాత్రికేయులు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువగా తీసుకెళ్లడంలో విస్తృతంగా ప్రచారం కల్పించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి సహాయ, సహకారాలు అందించాలని జిల్లా కలెక్టర్, అక్రిడిటేషన్ కమిటీ చైర్‌పర్సన్ పి ప్రశాంతి అన్నారు. సోమవారం భీమవరంలోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లాలో 2023 – 2024 కాలపరిమితితో అర్హత కలిగిన మీడియా ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డులను పంపిణీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాలాధికారి, అక్రిడిడేషన్ కమిటీ కన్వీనర్ టి.నాగేశ్వరరావు, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహమూర్తి

సాక్షి, భీమవరం: గీత కార్పొరేషన్‌కు తక్షణం రూ.5 వేల కోట్లు కేటాయించి రాష్ట్రంలో వృత్తి ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జుత్తిగ నర్సింహమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం భీమవరం డివిజన్ కల్లుగీత సొసైటీ అధ్యక్షులు, గీత కార్మికుల విస్తృత సమావేశం కడలి పాండు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నర్సింహమూర్తి మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేయాలని, గీతవృత్తి ఆధునికీకరణకు నిపుణులతో అధ్యయన కమిటీ వేయాలని, ప్రమాదాలను నివారించడానికి సేఫ్టీ మోకులు ఇవ్వడంతోపాటు నీరా, తాటి ఉత్పత్తుల పరిశ్రమలు పెట్టి కల్లుకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. జిల్లా సహాయక కార్యదర్శి బొక్కా చంటి, చింతపల్లి వీరాస్వామి, కొమిటి సత్యనారాయణ, తుంగ సాయి బాబు, కాగిత రాధాకృష్ణ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

భీమవరం డివిజన్
90102 23729

Office mail : tpgadvt@gmail.com